# హారిణి

– వేగి నాగేశ్వరరావు

హరిణితో కలసి వున్న కాస్త సమయం నన్ను నేను మరచిపోయేవాడిని. సెల యేటి గలగలల్లా ఆమె నవ్వుతూ వుంటే ఆ ప్రవాహంలో కొట్టుకుపోయేవాడిని. వేసవి వెన్నెల్లా ఆమె చూస్తూ వుంటే ఆ చూపుల్లో కరిగిపోయేవాడిని. ఆమె సహచర్యంలో బ్రతికేస్తున్న రోజుల్లోనే వరద గోదారిలా నా ప్రమేయం లేకుండానే నా జీవితంలోకి ప్రవేశించింది శారద.

శారద మరెవరో కాదు. నాకు స్వయానా అత్తకూతురు. నాకు పదేళ్ల వయసుంటుందేమో, భూమి తగాదాల్లో వాళ్ల కుటుంబం మా కుటుంబం ఉత్తర దక్షిణ దిక్కులయ్యాం. మేము కొన్నాళ్లకి ఊళ్లో వున్న పొలాలు ఆస్తులు అమ్మేసుకొని విజయవాడ వచ్చేసాం. పట్టుపావడాల్లో బొద్దుగా ముద్దుగా కన్పించిన చిన్నప్పటి శారద ఇప్పుడు చలాకీగా జీన్స్‌లో ఆధునికంగా జలపాతాల హోరుని మించిన ఉధృతిగా నన్ను చుట్టుముట్టేసింది. వచ్చిన రెండోరోజే మా మావయ్యా అత్తయ్యా యాక్సిడెంట్‌లో పోయారని ఇక తనకున్న ఆప్తులు మేమేకదా ఇక్కడే వుండిపోవాలని వచ్చానని చెప్పింది. పాత కక్షలూ గొడవలూ మరచిపోయి శారదను అక్కున చేర్చుకున్నారు అమ్మానాన్న. ఇంట్లో ఆడపిల్ల లేకపోవటంతో అమ్మ చిన్నప్పుడే శారదపై ప్రత్యేకంగా ప్రేమను చూపించేది. శారద నవ్వు వెనుక విషాదం చూసి నేనూ బాధపడ్డాను. ఇంత కష్టంలో మమ్మల్ని గుర్తుపెట్టుకొని మా దగ్గరికి వచ్చినందుకు ఆనందించాను.

హరిణికి నాకు ఎం.బి.బి.యస్ కలసి చదువుతున్నప్పటినుంచీ మంచి పరిచయముంది. హరిణి హాయిగా నవ్వుతుంది, ప్రశాంతంగా మాట్లాడుతుంది. ఏ సమయంలోనూ బ్యాలెన్స్ తప్పకుండా ఎదుటివారిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తుంది. నిజానికి ఆ గుణానికే ఆమెపట్ల ఆకర్షితుడయిన నేను ఆమెతో పరిచయం పెంచుకున్నాను. ఆ పరిచయం, స్నేహంగా మారిన కొన్నాళ్లకి ఇరువురి వ్యక్తిత్వాలు కలవటంతో అప్పుడప్పుడే ప్రేమించుకుంటున్నాం.

చల్లని సాయంత్రాలన్నీ తీపి కబుర్లతోనూ, ప్రకాశం బారేజీ దగ్గర ఫుట్‌పాత్‌పై పావుబాజీ తింటూనో కరిగించేసేవాళ్లం. అప్పుడప్పుడు ఒకరి ఇళ్లకు ఒకరం వెడుతూ వుండేవాళ్లం.

అటు శారద కూడా మా ఇంట్లో చాలా బాగా కలసిపోయింది. అమ్మకి శారదను తన కోడలిని చేసుకోవాలని కోరిక ఎప్పుడు పుట్టిందోగాని, అది బాగా పెరిగిపోవటంతో ఓరోజు అమ్మ నాదగ్గరికి వచ్చి, ''శశీ నిన్ననే శారద నీపై చిన్నప్పటినుంచే ప్రేమను పెంచుకున్నానని, నిజానికి నీకోసమే ఇక్కడకు వచ్చానని చెప్పింది. మరి నీ అభిప్రాయం కూడా చెబితే మీ ఇద్దరికి పెళ్లి చేయాలనుకుంటున్నాం'' అంది. నిశ్చేష్టుడనయ్యాన్నేను.

కొంచెం తేరుకున్నాక ఆవేశం ఆవేదన కలగలిపిన స్వరంతో ''అమ్మా...!? హరిణీ నేనూ ప్రేమించుకుంటున్నాం అని తెలిసీ శారదను చేసుకోమని ఎలా అడిగావు. శారదను పెళ్లిచేసుకోవాలనే కోరిక నాకేకోశానా లేదు. శారద నా చిన్నప్పటి స్నేహితురాలు, ఎంతో విషాదంలో వున్న ఆ స్నేహితురాలి బాధను పంచుకోగలను కాని జీవితాన్ని పంచుకోవాలంటే ఒక్క హరిణితోనే సాధ్యం.'' అంత ఖరాఖండిగా చెప్పేసరికి అమ్మ సెంటిమెంటు దెబ్బతింది.

''చూడు శశీ. శారద నా తమ్ముడి కూతురు. నా తోడబుట్టినవాడితో ఏనాడో జరిగిన గొడవలు నిన్నూ శారదను ఈ ఎడబాటుకు గురిచేసాయి. మీ ఇద్దరికి పెళ్లి చేయాలని ఏనాడో నిర్ణయించుకున్నాం. అది పుట్టినప్పుడే నీ పెళ్లామనుకున్నాం. జరిగింది మంచికో చెడుకో శారద ఇలా మనిల్లు చేరింది. అది మనందరినీ తెంచుకోలేకే ఇక్కడకు వచ్చింది. బావ తనవాడని బావతోడిదే తన లోకమని అది నమ్ముతుంది. అసలే తల్లిదండ్రులను కోల్పోయిన విషాదంలో వున్న దాని నమ్మకాన్ని దెబ్బతీసావంటే అది ఏమయినా చేసుకుంటుందేమో అని నా భయం. నువ్వు కాదంటే చావుకు, మా ఆత్మక్షోభకు నువ్వే కారణమవుతావు. అందుకు నిన్ను నీ జీవితాన్ని త్యాగం చేయమనటంలేదు. నీ ప్రేమను మాత్రం త్యాగం చేయమంటున్నాను. హరిణి తెలివయినది. జీవితం గురించి నీకన్నా బాగా తెలిసినది. నిన్నర్థం చేసుకుంటుందనే అనుకుంటున్నాను.'' అమ్మ కూడా అంతే ఖచ్చితంగా తన మనసులో వున్నది చెప్పేసింది. కొన్నాళ్లు మౌనంగా గడిపాను.

ఓ సాయంత్రం కృష్ణ ఒడ్డున కూర్చున్నప్పుడు హరిణి ''శశీ, ఈమధ్య ఏదో పోగొట్టుకున్నవాడిలా వుంటున్నావు. ఓ ప్రియురాలితో పంచుకోలేనంత వేదన నీకుంటుందని నేననుకోను. మంచైనా చెడైనా నీతో పంచుకొనేందుకు నేనున్నానని మరిచిపోవద్దు.''

హరిణి ఏ సమయంలోనూ బ్యాలెన్స్ తప్పకుండా ఎదుటివారిని అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తుంది. ఆ నమ్మకంతోనే చెప్పటం మొదలుపెట్టాను.

''హరిణీ అమ్మంటే నాకు ప్రాణం, నాన్నంటే నాకు జీవం. నాకు దేవుడంటే నమ్మకం లేదు. కన్పించే తల్లిదండ్రులే నాకు దైవాలు. నాకు చిన్న తలనొప్పి వచ్చినా తన ప్రాణం పోతున్నంతగా గిలగిలలాడుతుంది అమ్మ. నాకేం కావాలన్నా ఆఘమేఘాల మీద వచ్చి చేరేట్లు చేసేవారు నాన్న. ఈ పాతికేళ్ల జీవితంలో నువ్వు ఇది చేయి అని ఆజ్ఞాపించనూలేదు. మాకిది కావాలని అడగనూలేదు. కష్టం వస్తే వాళ్లు దాచుకున్నారు. సంతోషాన్ని నాకు పంచారు. ఇన్నాళ్లకు శారదను చేసుకోమని లేదా వాళ్లను వదులుకోమని ఆజ్ఞాపన, అభ్యర్థన కలగలిపిన ఓ కోరిక కోరారు. ఇది మనిద్దరి జీవితానికి సంబంధించిన నిర్ణయం కావున నీకు చెప్పలేక నాలో దాచుకోలేక సతమతమవుతున్నాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. హరిణీ, నీతో జీవితం పంచుకోవాలని మనసా, వాచా, కర్మణా కోరుకుంటున్నాను. నా తల్లి కంట కన్నీరు చూడలేను. అలాగని నిన్ను వదులుకోవటానికి సిద్ధంగా లేను. ఈ ఊగిసలాట ధోరణిలో పిచ్చివాడినయిపోతానేమోనని భయంగా వుంది.''

కొన్ని నిమిషాలు మా ఇద్దరి మధ్యా నిశ్శబ్దం రాజ్యమేలింది. ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ ప్రశాంతంగా, గంభీరంగా హరిణి మాట్లాడటం మొదలుపెట్టింది.



''భోరున కురిసే వర్షంలో తడుస్తూ తడిసిన పుడమి పరిమళాలను కలిసి ఆఘ్రాణించాం. కృష్ణ నీటిలో పాదాలు తడుపుతూ ఎన్నెన్నో కబుర్లు చెప్పుకున్నాం. కొబ్బరి తోపుల్లో దాగుడుమూతలాడిన జ్ఞాపకాలిప్పటికీ పదిలంగానే ఉన్నాయి. సంకీర్తన సినిమా చూస్తూ మొక్కజొన్న కండెలు తినడం అనే చిన్న అనుభూతి కూడా నీతో పంచుకున్నందుకు నాలో బ్రతికే ఉంది. నీతో గడిపిన ఒక్కొక్క జ్ఞాపకం వయస్సు వందేళ్ళు. నాకు నువ్వులేకా నువ్వున్నట్టే. పిల్ల తెమ్మెరలు తాకితే నీ స్పర్శ జ్ఞాపకం వస్తుంది. చిరుగాలికి కదిలే ఆకుల గలగలలు సైతం నీ నవ్వుని గుర్తుకు తెస్తాయి. మరుమల్లెలు, సన్నజాజులు. సంపెంగలు కలబోసిన నీ స్నేహపరిమళం గుండెల్లో గుభాళిస్తూనే ఉంటుంది. ఒక కొమ్మకు పూసిన ప్రతిపూవు పూజలో చేరుతుందనుకోను. కొన్ని పూవులకు మాత్రమే ఆ అవకాశం దక్కుతుంది. వేయి పూవులతో వికసించాల్సిన శారద జీవితం నువ్వు లేనినాడు మొక్కగానే ముగిసిపోతుంది. జీవితంలో సర్దుబాటు చాలా అవసరం. నన్ను గురించి ఆలోచించకపోతేనే నువ్వు శారదను చేసుకోగలవు. మధ్యలో వచ్చిన నేను మధ్యలోనే తప్పుకోవటం ఉత్తమం. ఇన్నాళ్ళూ కని పెంచిన తల్లిదండ్రులతో నాకోసం పోరాడి నువ్వు తప్ప దిక్కులేని శారదను అనాధను చేయకు. ఒకరి చావు మరికొంతమంది బాధ మన ప్రేమను బ్రతికిస్తుందంటే ఆ ప్రేమ నాకొద్దు. ఈ జీవితానికింకేం వద్దు. నీ జ్ఞాపకం చాలు. నాకోసం పంచిచ్చిన ఆ కొద్ది అనుభవాలు చాలు. నాలో ఆయువున్నంత వరకూ ఆనందంగా బ్రతికేయగలను. నావృత్తి నాజీవితంపై ఆశను చిగురింపజేస్తుంది. నాకు బొంబాయిలో ఉద్యోగం వచ్చింది. నాకోసమైనా శారదను పెళ్ళిచేసుకో. మీ పెళ్ళి చూసి వెళ్ళిపోవాలనుంది.''

నా గుండె రోదిస్తోంది. 'నాకోసమయినా నువు శారదను చేసుకో' అన్న హరిణి మాట శారద, శారదాశశిగా మారటానికి నా అంగీకారం తెలిపింది. శారదకూ నాకూ పెళ్ళి జరిగిపోయింది. హరిణే దగ్గరుండి అన్ని విషయాలు చూసుకొని నాపెళ్ళి జరిపించింది.

నా పెళ్ళి అయిన నాలుగోరోజున హరిణి బొంబాయి వెళ్ళిపోయింది. ఎంతటి గాయాన్నైనా మాపగల శక్తి కాలానికుంది. ఆ విషాదాన్ని మరచిపోయి నేనూ కాలంతో రాజీపడిపోయాను.

ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన హరిణిని పూర్తిగా మరచిపోయాను. ఇప్పుడు శారద నేను ఓ అందమయిన కుటుంబం. నాలుగేళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడు శారద నిండు గర్భిణీ. లేబర్ పెయిన్స్ స్టార్టవటంతో తనని హాస్పటల్‌కి చేర్చి, ఇంటికి వచ్చాను. టేబుల్‌పై ఉత్తరం కనిపించింది. తీసి చూసి ఆశ్చర్యపోయాను.

శశికి,

ఐదేళ్ళ క్రిందటిమాట, అప్పుడు మనం వైశాలి సినిమాకెళ్ళాం. నన్ను ఇంటి దగ్గర దించేసి నువ్వెళ్ళిపోయావు. ఆరోజు రాత్రంతా భరించలేనంత తలనొప్పి. చచ్చిపోతానేమో భయంవేసింది. ఉదయాన్నే డాక్టర్‌ని కలసి అన్ని టెస్టులు చేయించుకున్నాను. ఆ టెస్టుల రిపోర్టులు చూసేసరికి ఒక డాక్టరుగా నాకున్న వ్యాధి నన్ను మృత్యువుకు అతిదగ్గరలో

## జామ్ జామ్!

ప్రఖ్యాత క్రికెట్ ఆటగాడు శ్రీనాథ్, మరొక ఆటగాడు ద్రవిడ్‌ను 'జామీ' అని పిలుస్తూ వుంటాడు. ఎందుచేతనంటే ద్రవిడ్ తనతోపాటు ఎక్కడకు వెళ్లినా ఓ జామ్ బాటిల్‌ను వెంట తీసుకువెళ్తూ వుండటం వల్ల. సునీల్‌గవాస్కర్‌కు ఆ పేరు బాగా వచ్చింది, దాన్ని బాగా పాపులర్ చేశాడు. ఈమధ్య ఒక జామ్ కంపెనీ ప్రచారం కోసం ద్రవిడ్‌ను విని యోగించుకొంటోంది. వారు అతణ్ణి 'జామీ' అని ఆ ప్రకటనలో ముద్దుగా ప్రకటించారు. ఇంతకూ ద్రవిడ్‌కు జామ్ అంటే ఎందుకంత ఇష్టమంటారు? ఒకప్పుడు అతని తండ్రి ఓ జామ్ ఫ్యాక్టరీలో ప్రొడక్షన్ మేనేజర్‌గా పనిచేసేవా డట. ఆయన జామ్ డబ్బాలు తరచుగా ఇంటికి తీసుకువెళ్లేవాడు. అవి ద్రవిడ్‌కు అలవాటు అయి 'జామీ' అయ్యాడు.

## ఏడు చెడ్డ అలవాట్లు

అమెరికాలోని కొందరు శాస్త్రజ్ఞులు మానవులపై కొన్ని పరిశోధనలు చేశారు. తేలిందేమంటే ప్రతీ మనిషికీ ఏడు చెడ్డ అలవాట్లు వుంటాయని. కోపంతో పళ్లు కొరకడం, గోళ్లు కొరుక్కోవడం, ముక్కులను కెలకడం, గొంతును తరుచుగా సవరించుకోవడం, వ్రేళ్లను టకటక విరుచుకోవడం, నచ్చని వెంట్రుకను గుంజి గుంజి లాగడం. వీటిల్లో ప్రతీ అలవాటు ఎనిమిది సంవత్సరాలు గడిచేసరికి ఆయా వ్యక్తులు వదిలిపెడతారని కూడా ఆ శాస్త్రజ్ఞులు సెలవిచ్చారు.

-కొడిమెల

వుంచిందన్న సంగతి అర్థమయ్యింది. పేషెంటుగా నాకు బ్రతకాలనే ఉన్నా డాక్టర్‌గా నా పరిస్థితి నాకు అర్థమయ్యింది. భరించలేనంత టెన్షన్, మనోవేదన. ఈ విషయం తెలిస్తే నువ్వు తట్టుకోగలవా?! ప్రాణంగా ప్రేమిస్తున్న నీకు ఈ విషయం చెప్పాలో లేక నాలోనే దాచుకోవాలో తెలియక సతమతమయి పోయేదాన్ని. ఓరోజు మాబాబాయి బొంబాయిలో తన హాస్పటల్లో వర్క్ చేయమని నన్ను కోరారు. సరే ఉద్యోగం పేరిటన్నా నీకు దూరమయితే నీ జ్ఞాపకాల్ని మెల్లి మెల్లిగా తుడిచేయొచ్చులే అనుకున్నాను. సరిగ్గా అదే సమయానికి మీ ఇంట శారద అడుగుపెట్టింది. శారదను చూడగానే నా ఆలోచనలన్నీ ఓ రూపం సంతరించుకున్నాయి.

ఓరోజు నువ్వు లేనప్పుడు మీ ఇంటికి వెళ్ళాను. ఆంటీ నన్ను చూస్తూనే ''ఏమ్మా! హరిణీ మావాడిని పెళ్ళికొడుకునెప్పుడు చేస్తావు'' అడిగారు. అలా అడగ్గానే ఎందుకో నాకు ఏడుపు వచ్చేసింది. ఆపుకోలేకపోయాను.

ఆంటీని అలాగే పట్టుకొని మనసు తీరా ఏడ్చేసాను. కొండంత దిగులు గుండెల్లోంచి దిగిపోయింది. మనసు తేలికగా మారాక ఆంటీకి నా విషయం చెప్పాను. ''ఆంటీ ఈ పరిస్తుతుల్లో నేను శశిని చేసుకోలేను. శారద అందమైనది, చదువుకున్నది, ముఖ్యంగా మీ మేనకోడలే కాబట్టి మీరే శశిని ఎలాగైనా ఒప్పించి వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసేయండి.'' అన్నాను.

''అమ్మా హరిణీ నీకు మేమంత హృదయంలేని వాళ్ళలా కన్పిస్తున్నామా? అందరూ ఎప్పుడో ఒకప్పుడు పోతవాళ్ళమే. నువ్వొకర్తె ముందు అంతే. నాకోడలి స్థానంలో నిన్ను తప్ప మరెవ్వరినీ ఊహించలేను. సైన్స్ ఎంతో అభివృద్ధి చెందింది. ఇవ్వాళ లేకపోయినంత మాత్రాన నీ జబ్బుకి రేపన్నా మందు వస్తుందనే నా నమ్మకం. హాయిగా మీరిద్దరూ పెళ్ళి చేసుకోండి. నీమీదే ఆశలు పెట్టుకున్న నాకొడుకుని అన్యాయం చేయకు. ప్రేమంటే త్యాగమే కాదనను. కానీ మనల్ని మనమే వంచించుకునేంత త్యాగం పనికిరాదు.''

''లాభం లేదాంటీ, అన్నిదారులు మూసుకుపోయాకే నేనీ నిర్ణయానికి వచ్చాను. నాశశి బాధపడితే నేను చూడలేను. శశిని చూస్తూ నేనిక్కడ ఉండలేను. ఆ ఆవేదనను నేను భరించలేను. ప్లీజ్ నామాట మన్నించండి.'' ఎలా అయితేనేం ఆంటీని ఒప్పించగలిగాను. మీ ఇద్దరికీ పెళ్ళి అయిపోయాక నేను బొంబాయి వెళుతుంటే ఆంటీ కళ్ళలో తిరిగిన నీటి సుడులు, ఎప్పటికీ మరచిపోలేను. బొంబాయిలో మెల్ల మెల్లగా పేషెంట్లని, ఆపరేషన్లనీ.. ఇలా మను షుల్లో పడ్డాను. నాజబ్బు నన్ను బాధపెట్టేదికాదు.

నీ జ్ఞాపకం నన్ను బాధించేది. గున్నమావి చెట్ల కింద సూది చినుకుల వర్షంలో తడిసిన జ్ఞాపకం, వెన్నెల్లో కృష్ణపై పడవల్లో షికార్లు చేసిన జ్ఞాపకం, మనం తిరిగిన పూలతోటలు, మనం కట్టుకున్న ఆశల బొమ్మరిల్లు, మనం చేసుకున్న ప్రమాణాలు ఎన్నని మరచిపోగలను.

నీతో గడిపిన ఒక్కొక్క జ్ఞాపకం ఒక్కొక్క సూదిలా మారి నా సుకుమారపు హృదయానికి గాయం చేస్తుంటే తట్టుకోలేకపోయేదాన్ని. నీ జ్ఞాపకమో, బ్రతకాలన్న నా సంకల్పమో, నేను బ్రతకటం కోసం నాపేషెంట్లు చేసిన పూజల ఫలితమో ఈ కొన ప్రాణం నాలుగేళ్ళు కొనసాగింది. ఇవాళ నాకు మేజర్ ఆపరేషన్. నేను చనిపోతే ఈ ఉత్తరం నీకం దజేయమని రాస్తున్నాను.

ఈ ఉత్తరం నువ్వు చదివేటప్పటికి ఖచ్చితంగా నా ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోయే ఉంటాయి. ఆనందంగా సాగిపోయే నీ జీవితంలోనికి మరలా గతాన్ని తెచ్చి నిన్ను బాధపెట్టాలని నేనీ ఉత్తరం రాయటం లేదు. నిన్ను నన్ను విడదీసారని అనుకుంటున్న నీ తల్లిదండ్రులపై ఏ మూలో చిన్న అసంతృప్తి మిగిలే ఉంటుంది. ఆ అసంతృప్తిని రూపుమాపాలని, ఆంటీ గొప్ప మనసు నీకు తెలియాలని ఈ ఉత్తరం రాస్తున్నాను.

నిజంగా నాకు మరోజన్మంటూ ఉంటే అలాంటి అమ్మకడుపులోనే పుట్టాలని కోరుకుంటున్నాను. జీవితాంతం కలిసే ఉంటానని ప్రమాణం చేసి ఇలా అర్థాంతరంగా తప్పుకున్నందుకు క్షమించు.

నీ హరిణి

నాకళ్ళు ఏడుపు మరచిపోయినట్లున్నాయి. ఒక్క కన్నీటి బొట్టూ రాలటంలేదు. గుండె బరువెక్కటం మాత్రం తెలుస్తుంది.

''శశీ'' పిలుస్తూ అమ్మ వస్తుంది.

అప్పుడు వచ్చాయి నీళ్ళు, కన్నీళ్ళ జడివాన, కళ్ళు మసకబారుతున్నాయి. అమ్మ రూపం స్పష్టంగా తెలియటంలేదు. ఓ దేవత కన్పిస్తుంది.

''ఏంట్రా శశీ ఈ కన్నీళ్ళేంటిరా'' అమ్మ అనునయించేకొద్దీ కన్నీటి ప్రవాహం ఉధృతమయిపోతుంది.

''ఒరేయ్ నాకు వాళ్ళ బాబాయి రెండురోజుల క్రితమే ఫోన్ చేసాడ్రా. హరిణి కోరుకున్నది నీ ఆనందమేకాని నీకన్నీళ్ళు కాదు. ఇప్పుడే మీనాన్నగారు హాస్పటల్ నుంచి ఫోన్ చేసి చెప్పారు. ఒరే కన్నా నీకు హరిణి పుట్టిందిరా.'' అమ్మ చెప్తూనే వుంది.

నేను హాస్పిటల్‌కు పరుగులు తీశాను.

★

